

## తెలంగాణ రైతుల వరిధాన్యం సేకరణలో

# కేంద్ర ప్రభుత్వ వివక్ష

**రాష్ట్రం ఏర్పడ్డనాటి నుంచి తెలంగాణ ప్రభుత్వం రైతును రాజును చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నది. దేశంలో మరే రాష్ట్రంలోలేని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను రైతుల కోసం తెలంగాణ అమలు చేస్తున్నది. గత ఏడాదిగా కేంద్ర ప్రభుత్వం వరి ధాన్యం సేకరణపై లేనిపోని ఆంక్షలు విధిస్తూ రాష్ట్ర రైతాంగానికి తీరని అన్యాయం చేస్తున్నది. తెలంగాణ రైతాంగంలో, ప్రజల్లో మన ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికి బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతున్నది. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ గత శీతాకాల సమావేశాల్లో పార్లమెంటు సాక్షిగా తెలంగాణ ప్రభుత్వం భారత ఆహార సంస్థకు ఇవ్వాల్సిన బియ్యాన్ని ఇవ్వలేదని చెప్పారు.**

కానీ, అసలు విషయం రాష్ట్రంలో భారత ఆహారసంస్థకు కేవలం 20 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాములే ఉన్నాయి. ప్రైవేటు గోదాములను యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల్లో మన అధికారులు చూపెట్టినా.. ఎఫ్‌సీఐ (భారత ఆహార సంస్థ) వాటిని తీసుకోకుండా మొద్దు నిద్ర పోతూ తప్పిదాన్ని అటు రాష్ట్ర ప్రభుత్వంపై, ఇటు రైస్ మిల్లర్లపై నెట్టింది. రాష్ట్ర మంత్రులు, ఎంపీల బృందం ఇటీవల ఢిల్లీలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో సమావేశమైన సందర్భంగా ''మీ తెలంగాణలో యాసంగిలో పండే వడ్లు అసలు కొనడం జరగదు. ఎందుకంటే నూక శాతం అధికంగా ఉంటుంది దానితో కేంద్ర ప్రభుత్వానికి నష్టం వస్తుంది'' అని ఒక వ్యాపారిలా గోయల్ చెప్పడం శోచనీయం. తెలంగాణ బియ్యంలో వచ్చే నూకలను తెలంగాణ ప్రజలు

CM2_Layout 1 04/03/2022 7:22 PM Page 2

తినాలని, తెలంగాణ ప్రజలకు నూకలు అలవాటు చేయాలంటూ అహంకార పూరితంగా మాట్లాడారు. ప్రజాప్రతినిధుల బృందం ఎదుటనే తెలంగాణ ప్రజలను, రైతులను అవమానించారు.

ఈ బడ్జెట్ సమావేశాల్లో కూడా కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సాక్షాత్తు పార్లమెంటులో మళ్లీ తప్పుడు కూతలు కూశారు. వాటిని అందరూ వార్తా పత్రికల్లో చదివి ఉంటారు. గత వానకాలంలో వరి ధాన్యం సేకరిస్తున్న సమయంలో మధ్యంతరంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర పౌర సరఫరాల అధికారులను పిలిపించుకొని ఈ యాసంగి నుంచి తెలంగాణ రాష్ట్రంలో వరిధాన్యాన్ని సేకరించం అని చెప్పి ఒక అంగీకార పత్రాన్ని ఇస్తే ఈ వానకాలంలో మిగిలిన 45 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యానీ కొనుగోలు చేస్తాం లేకపోతే ఇక్కడనే ఆపేస్తామని బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేసి ఒక అంగీకారపత్రం రాష్ట్ర పౌర సరఫరాల అధికారుల నుంచి తీసుకున్నారు. దానినే బూచిగా చూపుతూ కేంద్ర మంత్రి గోయల్ అవాకులు చెవాకులు పేలుతున్నారు.

**కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర రైతులపై ఎంత వివక్ష చూపెడుతుందంటే అటు పంజాబ్, హర్యానాలో వానకాలంలో పండించే వరి, యాసంగిలో పండించే గోధుమలను పూర్తిగా కేంద్రమే ఎఫ్‌సీఐ (భారత ఆహార సంస్థ) ద్వారా కొనుగోలు చేస్తున్నది. అదే మన తెలంగాణ రైతుల వద్ద యాసంగి వరి పంటను కొనడానికి నిరాకరించి మన రైతులకు తీరని అన్యాయం చేస్తున్నది. మన రైతులను అవమానపరుస్తున్నది. మన ప్రధాన మంత్రి ఒకే దేశం ఒకే పన్ను విధానం అని చెప్పడమే కానీ చేతల్లో చూపడం లేదు. మన తెలంగాణ రైతులకు, ప్రజలకు, ప్రభుత్వ పన్నుల వాటాల్లో తీరని అన్యాయం చేస్తున్నారు. ఒకే దేశం ఒకే ప్రొక్యూర్‌మెంట్ విధానం ఉండాలన్నదే మన డిమాండ్.**



మన రాష్ట్ర బీజేపీ నాయకులు జిల్లాల్లో రైతుల వరి కల్లాల వద్దకు వెళ్లినపుడు ''వచ్చే యాసంగిలో కూడా రైతులందరూ వరి ధాన్యాన్ని పండించండి. ఆ ధాన్యం మొత్తం కేంద్ర ప్రభుత్వమే నేరుగా కొనేటట్లు మేము చూస్తాము. తెలంగాణ ప్రభుత్వానికి, కేసీఆర్‌కు ఇందులో ఎలాంటి ప్రమేయం లేదు. మొత్తం వరి ధాన్యాన్ని కల్లాల వద్దనే నేరుగా భారత ఆహార సంస్థ ద్వారా కొనుగోలు చేయించే బాధ్యత అటు కేంద్ర ప్రభుత్వంపై, ఇక్కడ రాష్ట్రంలో మా బీజేపీ నాయకులపై ఉన్నది'' అని ప్రగల్భాలు పలికిన ఆ పార్టీ నాయకులను గ్రామ గ్రామాన, జిల్లా, రాష్ట్ర స్థాయిలో తెలంగాణ రైతులు, ప్రజలు నిలదీయాల్సిన సమయం వచ్చింది. తెలంగాణ రైతులు, రైతు బంధు సమితి కార్యకర్తలు ఈ విషయంలో మన ఉద్యమ స్ఫూర్తిని చూపిస్తూ ఆ బీజేపీ నాయకులను ఎక్కడికక్కడ కడిగేస్తూ సంఘ బహిష్కరణ చేసి వారి మెడలను వంచి కేంద్ర ప్రభుత్వం చేత యాసంగి వరి ధాన్యాన్ని సేకరించే విధంగా ఒత్తిడి తేవాల్సిన తరుణం ఆసన్నమైంది. మన పార్టీ అధ్యక్షులు, గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ఇప్పటికే ఇచ్చిన కార్యాచరణపై మనం అందరం కదలాల్సిన అవసరం ఉన్నది. ఉద్యమ పార్టీగా, తెలంగాణ ప్రజల ఇంటి పార్టీగా మనం కేంద్రంపై పోరాటం చేద్దాం.



- ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ గడిచిన ఏడేండ్లలో వ్యవసాయ రంగంలో అద్భుతమైన ప్రగతిని సాధించింది.
- దేశానికే అన్నపూర్ణగా తెలంగాణ అవతరించింది.
- తెలంగాణ ఏర్పడేనాటికి (2014- 15) రాష్ట్రంలో 131.34 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉన్నది. అది 2020-21 నాటికి 203.80 లక్షల ఎకరాల విస్తీర్ణానికి పెరిగింది. తెలంగాణ సాధించిన విజయం ఇది. సీఎం కేసీఆర్ పట్టుదలకు నిదర్శనమిది.
- తెలంగాణలో 2014-15లో వరి ధాన్యం సేకరణ కేవలం 24.29 లక్షల మెట్రిక్ టన్నులు ఉన్నది. అది 2020-21 నాటికి 141.14 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకున్నది. దేశంలో వరి ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో ఉన్నదనడానికి ఈ లెక్కలే నిదర్శనం.
- ఎఫ్‌సీఐకు అత్యధిక వరి ధాన్యాన్ని సేకరించి ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ.
- దేశంలో రైతులకు ఉచితంగా 24 గంటలపాటు నాణ్యమైన విద్యుత్తును అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే.
- రైతు బంధు పథకం ద్వారా ప్రతి సంవత్సరం 63 లక్షల మంది రైతులకు 15,000 కోట్ల రూపాయల చొప్పున పెట్టుబడి సాయంగా అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. వీటిని దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నది. ఇప్పటి వరకు 50వేల కోట్లకుపైగా రైతుల ఖాతాల్లో జమ చేసిన ఏకైక ప్రభుత్వం కేసీఆర్‌దే.
- రైతు బీమా పథకం ద్వారా రైతు కుటుంబాలకు సామాజిక భద్రత, ఆర్థిక సహాయం (రు.5 లక్షలు) కల్పించుటకు సంవత్సరానికి భారత జీవిత బీమా సంస్థకు 1,450 కోట్ల రూపాయల బీమా ప్రీమియం చెల్లిస్తుంది.
- దురదృష్టవశాత్తు రైతు మరణిస్తే ఆయన కుటుంబం రోడ్డున పడకుండా ఆదుకుంటున్న ఏకైక సర్కారు తెలంగాణ సర్కారు.

- గంగాళాల్లా ఉన్న చెరువులను సమైక్య పాలకులు తాంబాళాలుగా మారిస్తే.. వాటిని పునరుద్ధరించి చెరువులను రైతులు, బెస్త, ముదిరాజ్ తదితర వర్గాల ప్రయోజనాలు కాపాడేలా, వారికి ఆదాయ వనరులా మారేలా తీర్చిదిద్దిన ఏకైక ప్రభుత్వం టీఆర్ఎస్ ప్రభుత్వం.
- రాష్ట్రవ్యాప్తంగా 5,160 చెరువులను 27వేల కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి చేసుకున్నాం.
- రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టుతోపాటు పలు కొత్త ప్రాజెక్టులు నిర్మించేందుకు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు లక్షన్నర కోట్ల రూపాయలను ఖర్చు చేసింది తెలంగాణ ప్రభుత్వం.
- రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 44.37 లక్షల ఎకరాలకు సాగు నీటిని అందిస్తున్నది.
- రాష్ట్రంలో ఆహారధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. వరి నుంచి ఇతర పంటలకు రైతులను మళ్లించడానికి ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది.
- వెయ్యి కోట్ల రూపాయలతో పామ్ ఆయిల్ చెట్ల పెంపకాన్ని టీఆర్ఎస్ ప్రభుత్వం ఇతోధిక ప్రోత్సాహం అందిస్తున్నది.
- రైతు రుణమాఫీని రెండు పర్యాయాలుగా చేసింది. 2014-18 మధ్య తొలి దఫాలో లక్ష రూపాయల వరకు ఉన్న రైతుల రుణాలన్నింటినీ మాఫీ చేసింది. 2018 ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు మరోసారి రుణమాఫీ చేపట్టింది. 50 వేల లోపున్న రుణాలను ఇప్పటికే మాఫీ చేయగా.. 75 వేల లోపున్న రుణాలన్నింటినీ ఈ ఏడాది చేయనున్నది. బడ్జెట్‌లో నిధులను కూడా కేటాయించింది.
- దేశంలో కేవలం రైతుల కోసమే ప్రత్యేకంగా వేదికలను, రైతు కల్లాలను ఏర్పాటు చేసిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం.
- ఈ ఒక్క ఏడాదే వ్యవసాయరంగానికి 25 వేల కోట్ల రూపాయలను బడ్జెట్‌లో కేటాయించుకున్నాం.
- 2014-15 ఆర్థిక సంవత్సరం నాటికి రాష్ట్రంలో కేవలం 176 గోదాములు మాత్రమే ఉండేవి. వీటిలో నిల్వ సామర్థ్యం 4,17,500 మెట్రిక్ టన్నులు మాత్రమే. అదే 2019-20 నాటికి ఏకంగా 567 గోదాముల స్థాయికి చేరింది. 25 లక్షల 32 వేల మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాలను ఇక్కడ నిల్వ చేసుకునేలా గోదాములను నిర్మించుకున్నాం.

## జై తెలంగాణ! జైజై తెలంగాణ!!